# ఆది శ్రీనివాస్‌కు రాఖీ కట్టిన సోదరి



**బలగం టీవీ, వేములవాడ**

రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఆయన సోదరి లీల స్వగృహంలో రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సోదరుడికి రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆది శ్రీనివాస్ సోదరి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

## రాఖీ కట్టిన ఆలయ ఈఓ, మాజీ మున్సిపల్ చైర్మన్





**బలగం టీవీ, వేములవాడ**

రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని వేములవాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఈఓ రమాదేవి, వేములవాడ మాజీ మున్సిపల్ చైర్మన్ నామాల ఉమా కలిశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్‌కు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనకు స్వీట్లు తినిపించి తమ ఆత్మీయతను చాటుకున్నారు.




## ధర్మారం ఎస్సైగా ఎంబడి శ్రీకాంత్ బాధ్యతల స్వీకరణ

**బదిలీపై వచ్చిన నూతన్ ఎస్సైకి సిబ్బంది శుభాకాంక్షలు**

నవతెలంగాణ –ధర్మారం

పెద్దపల్లి జిల్లా ధర్మారం పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్సైగా ఎంబడి శ్రీకాంత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన ఎం. ప్రవీణ్‌కుమార్ కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు.

ఆయన స్థానంలో ఆసిఫాబాద్ ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న ఎస్సై ఎంబడి శ్రీకాంత్‌ను ధర్మారం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ సిబ్బంది నూతన ఎస్సై శ్రీకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



## రాఖీ కట్టించుకునేందుకు దుబాయ్ నుంచి స్వగ్రామానికి

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

అక్కాచెల్లెళ్లపై ఉన్న ప్రేమాభిమానాన్ని చాటుకున్నారు ఎల్లారెడ్డిపేట మండలం అడవిపల్లి గ్రామానికి చెందిన రాధారపు సత్యం. గత కొన్నేళ్లుగా దుబాయ్‌లో స్థిరపడిన ఆయన రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేకంగా స్వగ్రామానికి వచ్చారు. అక్కాచెల్లెళ్ల చేత రాఖీ కట్టించుకుని వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ప్రతి సంవత్సరం రాఖీ పండుగ సందర్భంగా దుబాయ్ నుంచి స్వగ్రామానికి వచ్చి అక్కల చేత రాఖీ కట్టించుకోవడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నానని సత్యం తెలిపారు. విదేశాల్లో ఉన్నప్పటికీ కుటుంబ అనుబంధాలకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు.



## రేణికుంటలో ఆర్టీసీ బస్సు ఆపి అన్నకు రాఖీ కట్టిన చెల్లి

**బలగం టీవీ, తిమ్మాపూర్**

రాఖీ పండుగ రోజున విధుల్లో ఉన్న తన సోదరుడికి రాఖీ కట్టేందుకు ఓ సోదరి బస్సును ఆపించి మరీ రాఖీ కట్టింది. తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామానికి చెందిన తమ్మనవేని స్వప్న తన సోదరుడు మెండె రాజు ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

రాఖీ పండుగ సందర్భంగా రాజుకు సెలవు లభించకపోవడంతో హైదరాబాద్–గోదావరిఖని బస్సును నడుపుతూ విధులకు హాజరయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న స్వప్న రేణికుంట గ్రామంలో బస్సును ఆపించి, అందులో ఉన్న తన సోదరుడు రాజుకు రాఖీ కట్టింది. అనంతరం రాజు తన సోదరి ఆశీర్వాదం తీసుకున్నాడు.

విధి నిర్వహణలో ఉన్నప్పటికీ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రాధాన్యమిస్తూ స్వప్న చేసిన ఈ ప్రయత్నం పలువురిని ఆకట్టుకుంది.

# చేనేత సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాలి

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**సిరిసిల్లలో ఘనంగా నూలుపౌర్ణమి వేడుకలు**

**మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరు**

**చేనేత రంగ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం**



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

చేనేత వారసత్వాన్ని, సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సిరిసిల్లలో నూలుపౌర్ణమి సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. నూలుపౌర్ణమి పద్మశాలీల ఆత్మీయ, ఆధ్యాత్మిక పండుగ అని, చేనేత కార్మికులు మరియు పద్మశాలీ సమాజానికి ఇది అత్యంత విశిష్టమైన రోజని పేర్కొన్నారు. భక్త మార్కండేయ స్వామి ఆశీస్సులతో ఈ పండుగను ప్రతీ ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారన్నారు.





ప్రభుత్వ కార్యక్రమాల్లో చేనేత వస్త్రాలు:

నేత కార్మికులు తయారుచేసిన ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో చేనేత వస్త్రాలనే ఉపయోగించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా చేనేతకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన సిరిసిల్ల ప్రాంతంలో నూలుపౌర్ణమి వేడుకలకు మరింత ప్రాధాన్యం ఉందన్నారు. పవిత్రతకు, ఐక్యతకు ప్రతీక అయిన నూలుతో చేసిన కంకణాలను మహిళలు రక్షా కవచంగా ధరించడం, ఉపాకర్మలో భాగంగా యజ్ఞోపవీతం ధరించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

పట్టణ పద్మశాలీ సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ, భక్తి కార్యక్రమాలు, శోభాయాత్రలను ఘనంగా నిర్వహిస్తూ పద్మశాలీ సమాజం సంప్రదాయాలను కాపాడుతోందని మంత్రి కొనియాడారు.

## భూముల రీ సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్ నగేష్

**బలగం టీవీ, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొత్తపేటలో భూ భారతి కింద రోవర్ యంత్రంతో భూముల రీ సర్వే పనులు కొనసాగుతుండగా, శుక్రవారం రోజున అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే యంత్రంతో వివరాలు ఎలా సేకరిన్నారో పరిశీలించి, అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ; ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా భూ భారతి కింద భూముల రీ సర్వే పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో సర్వే పై రైతులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. భూముల వివరాలను పూర్తి పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులకు అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ పరిశీలనలో కొత్తపేట సర్పంచ్ ఇల్లందుల రాజు,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, తహశీల్దార్ షరీఫోద్దీన్,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## స్మార్ట్ రేషన్ కార్డులపై రాజకీయ నేతల ఫొటోలు వద్దు

**ప్రజాధనాన్ని వృథా చేయొద్దు.. రేషన్ కార్డు ప్రజల హక్కు**

**తాజా మాజీ సర్పంచుల జేఏసీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అక్కనపల్లి కరుణాకర్**



**బలగం టీవీ, బోయినిపల్లి;**

స్మార్ట్ రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి, మంత్రులు, రాజకీయ నాయకుల ఫొటోలు ముద్రించడం రాజకీయ ప్రచారమేనని తాజా మాజీ సర్పంచుల జేఏసీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అక్కనపల్లి కరుణాకర్ విమర్శించారు. రేషన్ కార్డు ప్రజల హక్కు తప్ప.. ఏ ఒక్క పార్టీ, నాయకుడు వ్యక్తిగతంగా ఇచ్చే కానుక కాదని స్పష్టం చేశారు.

బోయినపల్లి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని, ప్రభుత్వం మారిన ప్రతిసారీ రేషన్ కార్డులపై ఫొటోలు మార్చి కొత్త కార్డులు ముద్రిస్తే కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతుందని అన్నారు.

గత ప్రభుత్వం రేషన్ కార్డులు జారీ చేసినప్పటికీ వాటిపై రాజకీయ నాయకుల ఫొటోలను ప్రచారం కోసం ముద్రించలేదని గుర్తుచేశారు. రైతే రాజు అని మాటల్లో చెప్పడం కాకుండా రైతుల కష్టాన్ని గుర్తించే విధంగా రేషన్ కార్డుపై రైతు చిత్రం ముద్రించి గౌరవించాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుంటి శంకర్, బత్తిని కమల్‌గౌడ్, కన్నం సాగర్, కట్ట లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాఖీ వేళ వేములవాడలో భారీగా ట్రాఫిక్ జామ్

**బలగం టీవీ,వేములవాడ**

రక్షాబంధన్ వేడుకల నేపథ్యంలో వేములవాడ పట్టణంలో వాహనాల రద్దీతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. శుక్రవారం ఇతర పట్టణాలు, గ్రామాల నుంచి వేములవాడకు పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు తరలిరావడంతో కరీంనగర్, నంది కమాన్ రహదారులతోపాటు తిరుగు ప్రయాణంలో మూలవాగు వంతెనపై వాహనాలు బారులు తీరాయి.

రెండో బైపాస్ రహదారిలోని పార్క్ నుంచి తిప్పాపూర్ బస్టాండ్ వరకు వాహనాలు ఒకదానికొకటి ఆనుకొని నెమ్మదిగా కదిలే పరిస్థితి నెలకొంది. కరీంనగర్, సిరిసిల్ల వైపు నుంచి కూడా భారీగా వాహనాలు రావడంతో బస్టాండ్ కూడలి పూర్తిగా రద్దీగా మారింది.

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి బస్టాండ్ కూడలి వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించారు. రహదారులపై వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించి ట్రాఫిక్‌ను అదుపులోకి తీసుకువచ్చారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని పోలీసులు సకాలంలో స్పందించడంతో వాహనదారులు ఇబ్బందులు లేకుండా ప్రయాణం కొనసాగించారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి

**రెండో విడతలో నియోజకవర్గానికి 2,000 ఇళ్లు మంజూరు: వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**కథలాపూర్, మేడిపల్లి, భీమారం ఎంపీడీవోల-తో సమీక్షా సమావేశం**

**ఇందిరమ్మ కమిటీలు, ప్రజాప్రతినిధులతో సమ-న్వయంతో అర్హులనే ఎంపిక చేయాలని ఆదేశం**

బలగం టీవీ,వేములవాడ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతలో అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాల ఎంపీడీవోలతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.



రెండో విడతలో 2,000 ఇళ్లు మంజూరు:

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. వేములవాడ నియోజకవర్గానికి మొదటి విడత కింద 3,500 ఇళ్లు మంజూరు కాగా, రెండో విడతలో మరో 2,000 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై కూడా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

అర్హులకే పథకాలు అందాలి:

గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కథలాపూర్ ఎంపీడీవో శంకర్, మేడిపల్లి ఎంపీడీవో అంజుమా, భీమారం ఇన్‌చార్జ్ ఎంపీడీవో నీరజ తదితరులు పాల్గొన్నారు.

# చైనాలో భారీ భూకంపం

**నేపాల్‌కు మళ్లీ ఆనకట్ట తెగిపోయే ముప్పు!**
**సిచువాన్‌లో 5.1 తీవ్రతతో కంపించిన భూమి;**
**13 కి.మీ. లోతులో కేంద్రీకృతం**
**త్రిశూలి, భోటే కోషి పరివాహక ప్రాంతాలు ఖాళీ;**
**తీవ్ర ఆందోళనలో ప్రజలు**
**469కి చేరిన నేపాల్ వరద మృతుల సంఖ్య;**
**1,545 మందికి గాయాలు**

బలగం టీవీ, కాఠ్మండ్ / బీజింగ్



ఇటీవలి విపత్తు నుంచి తేరుకోకముందే నేపాల్ సరిహద్దు ప్రాంతాలకు మరో తీవ్ర వరద ముప్పు పొంచి ఉంది. చైనాలోని సిచువాన్ ప్రావిన్స్, లాంగ్‌చాంగ్ పరిసరాల్లో శుక్రవారం మధ్యాహ్నం 5.1 తీవ్రతతో సంభవించిన భారీ భూకంపం కారణంగా సరిహద్దులోని ఒక ఆనకట్ట తెగిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. భూమికి 13 కిలోమీటర్ల లోతులో కేంద్రీకృతమైన ఈ భూకంప ప్రభావంతో ఎగువ నుంచి బురద నీటి ప్రవాహం ఒక్కసారిగా వేగమందుకుంది.

త్రిశూలి పరివాహక ప్రాంతం ఖాళీ:

పైనుంచి భారీగా ఉప్పొంగి వస్తున్న నీటి ప్రవాహం నేపాల్‌లోని త్రిశూలి, భోటే కోషి నదీ తీర ప్రాంతాలను ముంచెత్తే ప్రమాదం ఉండటంతో అధికారులు తక్షణమే ఆ ప్రాంతాలను ఖాళీ చేయిస్తున్నారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, భద్రతా సిబ్బంది, స్థానిక ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని నేపాల్ పోలీసులు అత్యవసర ఆదేశాలు జారీ చేశారు. అలాగే సరస్సులో నీటి నిల్వలు 20 లక్షల క్యూబిక్ మీటర్ల నుంచి మరో 30 లక్షల క్యూబిక్ మీటర్లకు పెరిగే అవకాశం ఉండటంతో ఆనకట్ట పూర్తిగా తెగిపోయే ప్రమాదముందని చైనా అధికారులు నేపాల్‌ను హెచ్చరించారు.

సహాయక చర్యల వేగవంతం:

మరోవైపు భౌగోళిక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ నేపాల్ సైన్యం, హెలికాప్టర్ బృందాలు సహాయక చర్యలను కొనసాగిస్తున్నాయని ప్రతిపక్ష నాయకుడు భీష్మరాజ్ వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ప్రతి వనరునూ వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

469కి చేరిన మృతుల సంఖ్య:

నేపాల్‌లోని రసువా తదితర జిల్లాల్లో సంభవించిన ఆకస్మిక వరదల్లో మృతుల సంఖ్య శుక్రవారం నాటికి 469కి పెరిగినట్లు అధికారిక వర్గాలు ధ్రువీకరించాయి. అలాగే 1,545 మంది తీవ్రంగా గాయపడ్డారు. అత్యధికంగా చిత్వాన్ జిల్లాలోనే 178 మృతదేహాలు లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. 50 అడుగుల ఎత్తున నీరు ఉప్పొంగి రావడంతో ఇళ్లు, దుకాణాలు కొట్టుకుపోయి సర్వస్వం కోల్పోయామని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# నేపాల్ జలప్రళయం వెనుక అసలు కారణాలు..

**వెలుగులోకి తెచ్చిన ఇస్రో ఉపగ్రహ చిత్రాలు!**
**5,200 మీటర్ల ఎత్తులోని భారీ హిమానీనదం విరిగిపడటమే విపత్తుకు ప్రధాన మూలం**
**'లిక్విడ్ కాంక్రీట్'లా దూసుకొచ్చిన బురద, రాళ్లు, మంచు ప్రవాహం; నదికి ఏర్పడిన తాత్కాలిక అడ్డుకట్ట తెగిపోవడంతోనే విధ్వంసం**
**భూకంపం కాదని స్పష్టం చేసిన నిపుణులు; హిమాలయాల్లో పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ ముప్పు**

బలగం టీవీ,న్యూఢిల్లీ



నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతాలను వణికించిన ఘోర జలప్రళయానికి సంబంధించిన అసలు నిజాలు వెలుగులోకి వచ్చాయి. మొదట భూకంపం వల్లే ఈ విపత్తు సంభవించిందని భావించినప్పటికీ, శాస్త్రవేత్తల తాజా విశ్లేషణలు మరియు 'ఇస్రో' (ISRO)కు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ విడుదల చేసిన ఉపగ్రహ చిత్రాలు పూర్తి భిన్నమైన కారణాలను బహిర్గతం చేశాయి.

హిమానీనదం కూలిపోవడమే కారణం:

సముద్ర మట్టానికి దాదాపు 5,200 మీటర్ల ఎత్తులో ఉన్న భారీ హిమానీనదంలో మూడింట రెండు వంతుల భాగం ఒక్కసారిగా విరిగిపడటమే ఈ ఘోర విపత్తుకు కారణమని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆగస్టు 24న తీసిన ఇస్రో 'సెంటినెల్-2' ఉపగ్రహ చిత్రాల్లో ఈ హిమానీనదం సురక్షితంగానే ఉన్నప్పటికీ, ఆగస్టు 26 నాటి 'ల్యాండ్‌శాట్-9' చిత్రాల్లో అది తీవ్రంగా దెబ్బతిని 1.2 కిలోమీటర్ల దిగువన ఉన్న 'లెండే ఖోలా' నదీ పరివాహకంలో కూలిపోయినట్లు స్పష్టమైంది. ఈ కూలిపోవడం ఎంత బలమైనదంటే, దానిధాటికి ఏర్పడిన శబ్దం మరియు ప్రకంపనలు భూకంప రికార్డర్లలో నమోదయ్యాయి.

'లిక్విడ్ కాంక్రీట్'లా మారిన ప్రవాహం:

పై నుంచి విరిగిపడిన మంచు ముక్కలు కొండచరియల నుండి రాళ్లు, మట్టి, చెట్లను తమతో పాటు దిగువకు తీసుకెళ్లాయి. దాంతో సాధారణ నీటికి భిన్నంగా అత్యంత సాంద్రత కలిగిన 'లిక్విడ్ కాంక్రీట్' లాంటి బురద ప్రవాహం తయారైంది. ఈ శిథిలాలు మొదట నది ప్రవాహాన్ని అడ్డుకుని తాత్కాలిక కట్టను ఏర్పాటు చేయగా, ఆ ప్రవాహ ఒత్తిడికి అది ఒక్కసారిగా తెగిపోవడంతో భోటే కోశీ - త్రిశూలి కారిడార్‌ను ప్రళయం ముంచెత్తింది. ఇళ్లు, భారీ వాహనాలు, బండరాళ్లు నీటి ఉధృతికి కొట్టుకుపోయాయి.

పెరుగుతున్న పర్యావరణ ముప్పు:

భూమి ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరగడం వల్ల హిమాలయాల్లోని శాశ్వత మంచు పొరలు దెబ్బతిని పర్వత ప్రాంతాలు అస్థిరంగా మారుతున్నాయని, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు మరిన్ని జరిగే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# నేపాల్ విపత్తుకు 5 నెలల ముందే హెచ్చరించిన నివేదికలు

**మంచు కొండల కరుగుదలే కారణమా?**
**1975 నుండి 27 మీటర్ల మేర తగ్గినా హిమానీనదాల మందం: ICIMOD నివేదిక వెల్లడి**
**2000 తర్వాత రెట్టింపైన మంచు కరుగుదల వేగం; తీవ్ర ప్రమాదంలో హిందూకుష్ హిమాలయ ప్రాంతాలు**
**హిమపాతానికి బదులుగా 4,000 మీటర్ల ఎత్తులో కురుస్తున్న వర్షాలు: శాస్త్రవేత్తల ఆందోళన**

బలగం టీవీ,న్యూఢిల్లీ



నేపాల్ సరిహద్దు ప్రాంతాలను ఇటీవల ముంచెత్తిన ఘోర వరద విపత్తుకు (272 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది గల్లంతైన ఘటన) సంబంధించి ఒక సంచలనాత్మక విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విపత్తు సంభవించడానికి ఐదు నెలల ముందే — 2026 మార్చిలోనే — అంతర్జాతీయ సంస్థ 'ICIMOD' (ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటెన్ డెవలప్‌మెంట్) రెండు అధ్యయన నివేదికల ద్వారా భవిష్యత్ ముప్పును స్పష్టంగా సూచించిందని తెలుస్తోంది.

మంచు కరుగుదలలో తీవ్ర ఉధృతి:

నేపాల్ రాజధాని కాఠ్మండ్ కేంద్రంగా పనిచేసే ICIMOD సంస్థ (భారత్, నేపాల్, భూటాన్, చైనాలు ఇందులో భాగస్వాములు) వెల్లడించిన నివేదికల ప్రకారం.. 1975 నుండి హిందూకుష్ హిమాలయా (HKH) పరిధిలోని హిమానీనదాల మందం సుమారు 27 మీటర్ల వరకు తగ్గిపోయింది. 1990 నుండి 2020 మధ్య కాలంలోనే ఈ ప్రాంత మంచు విస్తీర్ణంలో 12 శాతం, నిల్వల్లో 9 శాతం క్షీణత నమోదైంది. 2000 సంవత్సరం తర్వాత నుంచి మంచు కరిగే వేగం ఏకంగా రెట్టింపైందని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

మంచు కురిసే చోట భారీ వర్షాలు:

ఇటీవలి విపత్తుకు గల కచ్చితమైన కారణాలపై శాస్త్రవేత్తలు పరిశోధనలు జరుపుతున్నప్పటికీ, 4,000 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న ప్రాంతాల్లో మంచు (Snow) కురిసే బదులు వర్షం కురవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని విశ్లేషిస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల మంచు పొరలు తరిగిపోయి, కొండచరియలు, బంజరు రాతి భాగాలు బయటపడి వేడిని ఎక్కువగా గ్రహిస్తున్నాయని, ఇది కొండచరియల స్థిరత్వాన్ని దెబ్బతీస్తోందని డెహ్రాడూన్‌లోని వాడియా హిమాలయన్ జియాలజీ సంస్థతో పాటు ICIMOD నిపుణులు పేర్కొన్నారు.

ఆసియా జలనిధులకు ముప్పు:

ఆసియా ఖండంలోని 10 ప్రధాన నదులకు జీవనాధారంగా ఉంటూ, సుమారు 200 కోట్ల మంది జనాభాకు తాగునీరు, సాగునీరు మరియు విద్యుత్ అవసరాలను తీరుస్తున్న ఈ హిమానీనదాల క్షీణత భవిష్యత్తులో మరింత తీవ్రమైన ప్రతికూల పరిణామాలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# దొరకని ఈశా ఫౌండేషన్‌కు చెందిన 77 మంది యాత్రికుల ఆచూకీ



బలగం టీవీ,న్యూఢిల్లీ

చైనా-నేపాల్ సరిహద్దు సమీప ప్రాంతాల్లో రెండు రోజుల క్రితం సంభవించిన భారీ వరదల నేపథ్యంలో అదృశ్యమైన ఈశా ఫౌండేషన్‌కు చెందిన 77 మంది కైలాస మానససరోవర్ యాత్రికుల ఆచూకీపై ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లభించలేదని బృందం సమన్వయకర్త తెలిపారు.

భారత ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గా వాసుదేవ్ స్థాపించిన ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ 77 మంది యాత్రకు వెళ్లారు. భారీ వరదల అనంతరం వారితో ఎలాంటి సంబంధాలు లేకుండా పోయాయని బృందం సమన్వయకర్త మా గంభీరి తెలిపారు.

వరదల తీవ్రత ఎక్కువగా ఉన్న గ్యిరాంగ్ ప్రాంతాన్ని సందర్శించి సహాయక చర్యల్లో పాల్గొనాలని సద్గురు భావించినప్పటికీ, అవసరమైన అనుమతులు లభించలేదని ఆమె పేర్కొన్నారు. ఈ బృందంలో 19 దేశాలకు చెందిన వారు ఉన్నారని, సమాచారం, సహాయం కోసం భారత్, చైనా, నేపాల్‌లోని ఆయా దేశాల రాయబార కార్యాలయాలను సంప్రదించినట్లు తెలిపారు.

77 కుటుంబాల్లో తీవ్ర ఆందోళన

గత రెండు రోజులుగా అదృశ్యమైన 77 మంది యాత్రికుల గురించి ఎలాంటి సమాచారం అందలేదని, సహాయక బృందాలు ఘటనాస్థలంలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నప్పటికీ ఆచూకీ లభించలేదని మా గంభీరి తెలిపారు. 77 కుటుంబాలు తమ వారి కోసం తీవ్ర ఆందోళనతో ఎదురుచూస్తున్నాయని పేర్కొన్నారు.

ఈశా ఫౌండేషన్ ప్రతి సీజన్‌లో కైలాస మానససరోవర్ యాత్రలను నిర్వహిస్తుంది. యాత్రికులు నేపాల్‌లోని కాఠ్మాండు నుంచి టిబెట్‌కు వెళ్లి, కొంతదూరం కాలినడకన ప్రయాణిస్తారు.

గ్యిరాంగ్‌లోని ఇమ్మిగ్రేషన్ కార్యాలయంలో బృందం ఉన్న సమయంలోనే భారీ వరదలు సంభవించినట్లు సద్గురు బుధవారం సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. వరదలతో ఇమ్మిగ్రేషన్ కార్యాలయంతోపాటు పట్టణంలోని చాలా ప్రాంతాలు నీటమునిగినట్లు తెలిపారు. నేపాల్‌లోని టిమురే ప్రాంతంలో ముగ్గురు వాలంటీర్లు చిక్కుకుపోయినట్లు పేర్కొన్నారు.

అదృశ్యమైన వారిలో అమెరికాకు చెందిన 22 మంది, కెనడాకు చెందిన 12 మంది, ఆస్ట్రేలియాకు చెందిన 11 మంది, బ్రిటన్‌కు చెందిన తొమ్మిది మంది, జర్మనీకి చెందిన నలుగురు, ఫ్రాన్స్, నేపాల్‌కు చెందిన ముగ్గురేసి, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, సింగపూర్, స్పెయిన్‌కు చెందిన ఇద్దరేసి ఉన్నారు. ఫిన్లాండ్, హంగేరీ, ఇజ్రాయెల్, లిథువేనియా, ఫిలిప్పీన్స్, పోర్చుగల్, రష్యా, దక్షిణాఫ్రికాకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు.

నేపాల్ పోలీసుల వివరాల ప్రకారం, వరదల విధ్వంసంలో ఇప్పటివరకు కనీసం 579 మంది మృతి చెందగా, దాదాపు వెయ్యి మంది ఆచూకీ తెలియాల్సి ఉంది.



# నేపాల్ వరదల్లో అమానుషం

**మృతదేహం జుట్టు పట్టుకుని లాగి.. చెవి కమ్మల చోరీ!**
**నారాయణి నది తీరంలో దారుణం; సోషల్ మీడియాలో వైరల్ అయిన దృశ్యాలు**
**తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నెటిజన్లు; స్పందించిన చిట్వాన్ పోలీసులు**
**ఇద్దరు నిందితుల అరెస్ట్; చోరీ చేసిన బంగారు ఆభరణాలు స్వాధీనం**

బలగం టీవీ, న్యూఢిల్లీ

నేపాల్‌ను ముంచెత్తిన ఘోర ఆకస్మిక వరదలు మిగిల్చిన శోకసంద్రం ఒకవైపు గుండెలను పిండేస్తుంటే.. మరోవైపు కొందరి అమానుష ప్రవర్తన మానవత్వానికే మచ్చ తెచ్చింది. వరద నీటిలో కొట్టుకొచ్చిన ఒక మహిళ మృతదేహాన్ని జుట్టు పట్టుకుని లాగి, ఆమె చెవులకున్న బంగారు కమ్మలను దోచుకున్న దారుణ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

నారాయణి నది వద్ద అమానుషం:

బుధవారం సంభవించిన వరదల్లో అనేక మృతదేహాలు కొట్టుకురాగా, నారాయణి నది ప్రాంతానికి ఒక మహిళ మృతదేహం కొట్టుకొచ్చింది. అక్కడే ఉన్న మదన్ గురుంగ్ (25), ఉమేష్ చౌదరి (38) అనే ఇద్దరు వ్యక్తులు ఆ మృతదేహాన్ని పద్ధతిగా ఒడ్డుకు తీయకుండా జుట్టు పట్టుకుని లాగారు. అనంతరం ఆమె చెవులకు ఉన్న బంగారు కమ్మలను తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు.

పోలీసుల వేగవంతమైన చర్యలు:

ఈ దారుణ ఘటనను అక్కడి వ్యక్తులు రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వీడియో తీవ్రంగా వైరల్ అయింది. విపత్తు సమయంలో కనీస మానవత్వం, మృతదేహం పట్ల గౌరవం లేకుండా ప్రవర్తించిన నిందితులపై నెటిజన్ల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. దీనిపై తక్షణమే స్పందించిన చిట్వాన్ జిల్లా పోలీసులు విచారణ చేపట్టి, నిందితులు మదన్, ఉమేష్‌లను పోఖారా బస్ పార్క్ వద్ద అరెస్టు చేశారు. వారి వద్ద నుండి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు, మృతదేహాల పట్ల అపచారానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు.



# నార్వే రాజు హరాల్డ్-5 కన్నుమూత

బలగం టీవీ, న్యూఢిల్లీ

నార్వే రాజు హరాల్డ్-5 (89) కన్నుమూశారు. నార్వే రాజధాని ఓస్లోలో ఆయన శాంతియుతంగా తుదిశ్వాస విడిచినట్లు రాయల్ ప్యాలెస్ శుక్రవారం ప్రకటించింది. కొంతకాలంగా రక్త సంబంధిత వ్యాధితో బాధపడుతున్న హరాల్డ్‌ను ఈ నెల 17న ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న సమయంలో ఆయన ఆరోగ్యం మరింత క్షీణించినట్లు ప్యాలెస్ వెల్లడించింది.

కుమారుడికి రాజ్యాధికారం

హరాల్డ్-5 అనంతరం ఆయన కుమారుడు, 53 ఏళ్ల హాకోన్ నార్వే రాజుగా బాధ్యతలు చేపట్టనున్నారు. హరాల్డ్ నార్వే ప్రజల్లో అత్యంత ప్రజాదరణ పొందిన రాజుగా గుర్తింపు పొందారు. రాచరిక వ్యవస్థను ఆధునీకరించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

సాధారణ కుటుంబానికి చెందిన మహిళను వివాహం చేసుకోవడం, రాజకుటుంబ ఖర్చుల విషయంలో పారదర్శకత పాటించడం ద్వారా హరాల్డ్ ప్రత్యేక గుర్తింపు పొందారు. అయితే ఆయన కుటుంబ సభ్యులు కొంతకాలంగా పలు వివాదాలు, కుంభకోణాల్లో చిక్కుకోవడం చర్చనీయాంశంగా మారింది.

# నెతన్యాహును నరకానికి పంపుతాం

**ఇరాన్ ఘాటు హెచ్చరిక..**
**ట్రంప్ కుమారుడిపై హత్యాయత్నం ఆరోపణలను ఖండించిన మేజర్ జనరల్ మోషెన్**

బలగం టీవీ, టెహ్రాన్,



ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రరూపం దాల్చే పరిస్థితులు కనిపిస్తున్న వేళ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ఇరాన్ తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. నెతన్యాహును నరకానికి పంపుతామని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మేజర్ జనరల్ మోషెన్ రెజాయే హెచ్చరించినట్లు పేర్కొంది.

ఇకపై తమ యుద్ధ వ్యూహం కొత్త విధానంలో ఉంటుందని ఆయన తెలిపారు. తమ నౌకా మార్గాన్ని దిగ్బంధించిన అమెరికాకు కూడా హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మోషెన్ రెజాయే మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

ట్రంప్ కుమారుడిపై ఆరోపణలను ఖండించిన ఇరాన్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమారుడు బ్యారన్ ట్రంప్‌ను హత్య చేసేందుకు ఇరాన్ ప్రయత్నించిందన్న ఆరోపణలను మోషెన్ రెజాయే ఖండించారు. తాము అలాంటి ప్రయత్నం చేయలేదని స్పష్టం చేశారు. నెతన్యాహు తప్పుడు సమాచారం ఇవ్వడం ద్వారా ట్రంప్‌ను ఆందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

నెతన్యాహు తీసుకుంటున్న నిర్ణయాలు జియోనిస్ట్ పాలనకు ముగింపు పలికే పరిస్థితులకు దారితీస్తున్నాయని మోషెన్ పేర్కొన్నారు. నెతన్యాహు తప్పుడు సమాచారంతో అమెరికాను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు.

# నేపాల్‌కు సహాయం అందించేందుకు సిద్ధం : ట్రంప్

బలగం టీవీ, న్యూయార్క్



నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు, ఆకస్మిక వరదలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. విపత్తు నేపథ్యంలో నేపాల్‌కు అవసరమైన సహాయం అందించేందుకు అమెరికా సిద్ధంగా ఉందని తెలిపారు. వరదల్లో దాదాపు 90 మంది అమెరికా పౌరులు గల్లంతైనట్లు వెల్లడించారు. వారిని గుర్తించి, రక్షించేందుకు అమెరికా ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని పేర్కొన్నారు. నేపాల్‌తో అమెరికాకు మంచి సంబంధాలు ఉన్నాయని ట్రంప్ తెలిపారు.

గురువారం స్థానిక కాలమానం ప్రకారం మీడియాతో మాట్లాడిన ట్రంప్.. నేపాల్ అధికారులతో ఇప్పటికే సంప్రదింపులు జరిపినట్లు చెప్పారు. ఇంతటి ఘోర విపత్తును గతంలో ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. గల్లంతైన వారిలో డజన్ల కొద్దీ అమెరికన్లు ఉన్నారని, వారి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందన్నారు. వారంతా క్షేమంగా ఉండాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. వరదలు, బురదనీటి ఉద్ధృతికి పలు భవనాలు పేకమేడల్లా కూలిపోయాయని వివరించారు.

పౌరుల రక్షణే ప్రధాన లక్ష్యం

నేపాల్‌లో చిక్కుకున్న అమెరికా పౌరుల భద్రతను నిర్ధారించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైట్‌హౌస్ మాజీ కార్యదర్శి కరోలిన్ లీవిట్ తెలిపారు. సాధ్యమైనంత వరకు ప్రతి అమెరికన్‌ను రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని గురువారం ఫాక్స్ న్యూస్‌తో పేర్కొన్నారు.

రూ. కోట్లలో అత్యవసర సాయం

నేపాల్‌లో పరిస్థితిని అమెరికా విదేశాంగ శాఖ నిశితంగా పరిశీలిస్తోంది. రసువా జిల్లాలో సంభవించిన వినాశకర ఆకస్మిక వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపింది. సహాయ, రక్షణ చర్యల కోసం ప్రభావిత ప్రాంతానికి విపత్తు ప్రతిస్పందన బృందాన్ని పంపినట్లు వెల్లడించింది. గల్లంతైన వారిలో 90 మంది అమెరికా పౌరులు ఉన్నట్లు ధ్రువీకరించింది.

కాఠ్మాండులోని అమెరికా రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రభావిత ప్రాంతాల్లోని అమెరికా పౌరులను గుర్తించి వారికి సహాయం అందిస్తోంది. తక్షణ సహాయ చర్యల కోసం 5 లక్షల డాలర్లను ప్రకటించింది. నేపాల్‌లో ఉన్న అమెరికన్లు అత్యవసర పరిస్థితుల్లో అమెరికా రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని, స్థానిక అధికారుల




# డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు చేరిన నీరజ్ చోప్రా

**12 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచి తుదిపోరుకు అర్హత**

**వచ్చే నెల 5న బ్రసెల్స్ (బెల్జియం) వేదికగా ఫైనల్స్**

**అగ్రస్థానంలో నిలిచిన శ్రీలంక అథ్లెట్ పతిరగె**

బలగం టీవీ, న్యూఢిల్లీ

భారత గోల్డెన్ బాయ్, స్టార్ జావెలెన్ త్రోయర్ నీరజ్ చోప్రా వచ్చే నెల 5న బ్రసెల్స్ (బెల్జియం)లో జరుగనున్న ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ (DL) ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. ఈ సీజన్‌లో కేవలం రెండు డైమండ్ లీగ్ లీగ్ మ్యాచ్‌ల్లో (దోహా, లుసానె) మాత్రమే పాల్గొన్న నీరజ్, ఓవరాల్ పాయింట్ల పట్టికలో 12 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచి ఫైనల్స్ బెర్తును ఖాయం చేసుకున్నాడు.

పాయింట్ల వివరాలు:

దోహా లీగ్‌లో నాలుగో స్థానంలో నిలిచి 7 పాయింట్లు సాధించిన నీరజ్, లుసానె లీగ్‌లో రెండో స్థానంతో మరో 5 పాయింట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. గత గురువారం జురిచ్ వేదికగా జరిగిన ఆఖరి లీగ్ పోటీల్లో నీరజ్ పాల్గొననప్పటికీ, ఆ మ్యాచ్ ఫలితాల అనంతరం వెల్లడించిన పాయింట్ల ఆధారంగా అతనికి ఫైనల్స్‌లో స్థానం లభించింది.

పోటీలో ఇతర అథ్లెట్లు:

శ్రీలంకకు చెందిన పతిరగె 39 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించగా.. పీటర్సన్ అండర్సన్, కెశ్రాన్, థాంప్సన్, జులియస్ తదితర అథ్లెట్లు కూడా క్వాలిఫై అయిన వారి జాబితాలో ఉన్నారు.




# తెలంగాణ ఓపెన్ విజేతగా రషీద్ ఖాన్

**ఏడేళ్ల నిరీక్షణకు తెర!**

**వికారాబాద్‌లోని వూటీ గోల్ఫ్ కౌంటీలో మెరిసిన ఢిల్లీ గోల్ఫర్ రషీద్ ఖాన్**

**23-అండర్ 265 స్కోరుతో 15వ ప్రొఫెషనల్ టైటిల్ కైవసం; రూ. 15 లక్షల ప్రైజ్ మనీ సొంతం**

**20-అండర్ 268 స్కోరుతో రన్నరప్‌గా నిలిచిన హనీ బైసోయా**

బలగం టీవీ, వికారాబాద్

వెటరన్ గోల్ఫర్ రషీద్ ఖాన్ ఏడేళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ తెలంగాణ ఓపెన్ గోల్ఫ్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. శుక్రవారం ఇక్కడ ముగిసిన ఫైనల్ రౌండ్‌లో ఐదు-అండర్ 67 అద్భుత ప్రదర్శనతో మెరిసిన 35 ఏళ్ల ఢిల్లీ గోల్ఫర్ విన్నర్‌గా నిలిచాడు. ఓవరాల్‌గా 23-అండర్ 265 స్కోరు సాధించిన రషీద్ తన కెరీర్‌లో 15వ ప్రొఫెషనల్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు.

రూ. 15 లక్షల బహుమతి:

వూటీ గోల్ఫ్ కౌంటీ వేదికగా జరిగిన ఈ టోర్నీలో 3 స్ట్రోక్స్ తేడాతో విజయం సాధించిన రషీద్‌కు డిపి వరల్డ్ పిజిటిఐలో ఇది 11వ గెలుపు. ఈ విజయంతో రూ. 15 లక్షల ప్రైజ్ మనీ గెలుచుకోవడమే కాకుండా, పీజీటీఐ ఆర్డర్ ఆఫ్ మెరిట్ ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి ఎగబాకాడు.

పోటీలో ఇతర గోల్ఫర్లు:

ఢిల్లీకే చెందిన హనీ బైసోయా (20-అండర్ 268) ఆఖరి రౌండ్‌లో 65 స్కోరుతో అద్భుత ప్రదర్శన చేసి రెండో స్థానంలో నిలిచి రూ. 10 లక్షలు సొంతం చేసుకున్నాడు. గురుగ్రామ్‌కు చెందిన వీర్ అహ్లావత్ (19-అండర్ 269), రాత్రికి రేసులో ముందున్న అంగద్ చీమాతో కలిసి సంయుక్తంగా మూడో స్థానాన్ని పంచుకున్నారు.

నా భావోద్వేగాన్ని మాటల్లో చెప్పలేను: రషీద్

2019 ప్లేయర్స్ ఛాంపియన్‌షిప్ తర్వాత మళ్లీ పీజీటీఐ టైటిల్ గెలవడంపై రషీద్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. "నా సంతోషాన్ని మాటల్లో వ్యక్తపరచలేకపోతున్నాను. ఏడేళ్లుగా ఆటలో ఎన్నో హెచ్చుతగ్గులు చూశాను, చాలా నేర్చుకున్నాను. మళ్లీ విజేతగా నిలవడం చాలా సంతృప్తినిచ్చింది" అని వ్యాఖ్యానించాడు. ఫైనల్ రౌండ్ ప్రారంభంలో తొలి రెండు హోల్స్‌లో బోగీలతో నెమ్మదించినా, 10 నుంచి 12వ హోల్స్ వరకు వరుస బర్డీలతో కోలుకుని టైటిల్‌ను ముద్దాడాడు.



# ఫిలిప్పీన్స్‌తో భారత్ అండర్-17 మహిళల జట్టు రెండు స్నేహపూర్వక మ్యాచ్‌లు

**సెప్టెంబర్ 26, 29 తేదీల్లో గోవాలో మ్యాచ్‌లు**

బలగం టీవీ, హైదరాబాద్

ఏఎఫ్‌సీ అండర్-17 మహిళల ఆసియా కప్ అర్హత పోటీలకు సన్నాహాల్లో భాగంగా భారత అండర్-17 మహిళల ఫుట్‌బాల్ జట్టు ఫిలిప్పీన్స్‌తో రెండు స్నేహపూర్వక మ్యాచ్‌లు ఆడనుంది. గోవాలో సెప్టెంబర్ 26, 29 తేదీల్లో ఈ మ్యాచ్‌లు జరగనున్నట్లు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) శుక్రవారం వెల్లడించింది. రెండు మ్యాచ్‌ల వేదికలను తర్వాత ప్రకటించనున్నారు.

ఈ వయసు విభాగంలో భారత్, ఫిలిప్పీన్స్ జట్లు తలపడటం ఇది రెండోసారి కానుంది. 2017లో జరిగిన ఏఎఫ్‌సీ అండర్-16 మహిళల చాంపియన్‌షిప్ అర్హత పోటీల్లో ఫిలిప్పీన్స్ 2-0తో భారత్‌పై విజయం సాధించింది.

ఉజ్బెకిస్థాన్‌తో సన్నాహక మ్యాచ్‌లు

జోకిమ్ అలెగ్జాండర్సన్ శిక్షణలో భారత జట్టు ప్రస్తుతం తాష్కెంట్‌లో పర్యటిస్తోంది. ఆతిథ్య ఉజ్బెకిస్థాన్‌తో రెండు స్నేహపూర్వక మ్యాచ్‌లు ఆడుతోంది. గురువారం జరిగిన తొలి మ్యాచ్ గోల్ లేకుండానే డ్రాగా ముగిసింది. రెండో మ్యాచ్ ఆదివారం జరగనుంది.

ఫిలిప్పీన్స్‌తో జరిగే రెండు మ్యాచ్‌లు భారత యువ మహిళల జట్టుకు చివరి సన్నాహక మ్యాచ్‌లు కానున్నాయి. అనంతరం అక్టోబర్ 5 నుంచి 11 వరకు మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగే 2027 ఏఎఫ్‌సీ అండర్-17 మహిళల ఆసియా కప్ అర్హత పోటీల్లో భారత్ పాల్గొంటుంది.

అక్టోబర్ 5న ఇరాక్‌తో తొలి మ్యాచ్

అర్హత పోటీల్లో భారత్ అక్టోబర్ 5న ఇరాక్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. అక్టోబర్ 8న సిరియాతో, అక్టోబర్ 11న ఆతిథ్య మలేషియాతో తలపడుతుంది.

గత ఎడిషన్‌లో చైనాలోని సుజౌలో తొలిసారి నాకౌట్ దశకు చేరిన భారత యువ మహిళల జట్టు.. వరుసగా రెండోసారి ఏఎఫ్‌సీ అండర్-17 మహిళల ఆసియా కప్‌కు అర్హత సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# ఎనిమిదో స్థానంతో ముగించిన భారత్

**షూటౌట్‌లో భారత్ ఓటమి:**

**బెల్జియం చేతిలో 3-4 తేడాతో పెనాల్టీ షూటౌట్‌లో ఓడిన భారత పురుషుల జట్టు**

**చివరి సెకన్లలో హర్మన్‌ప్రీత్ సాధించిన గోల్‌తో 3-3తో సమమైన మ్యాచ్**

**51 ఏళ్ల నిరీక్షణకు తెరపడలేదు:**

**ప్రపంచకప్‌లోనూ నిరాశే మిగిలింది**



బలగం టీవీ, హైదరాబాద్

ఎఫ్ఐహెచ్ ప్రపంచకప్ (FIH World Cup) హాకీ టోర్నీలో భారత పురుషుల జట్టు ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. శుక్రవారం నాటకీయ పరిణామాల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య బెల్జియం జట్టు చేతిలో 3-4 (షూటౌట్) తేడాతో ఓటమిపాలైంది.

చివరి క్షణం వరకు హోరాహోరీ:

టోర్నీలో నిరాశాజనక ఫలితాలు చవిచూసిన భారత జట్టు, బెల్జియంతో జరిగిన పోరులో గట్టి పోటీ ఇచ్చింది. ఆట 6వ నిమిషంలోనే అభిషేక్ గోల్‌తో భారత్‌కు ఆధిక్యం అందించాడు. అయితే రెండో క్వార్టర్‌లో బెల్జియం ఆటగాళ్లు దువేకోట్ (22వ నిమిషం), లాబౌచేరే (23వ నిమిషం) వరుస గోల్స్‌తో భారత్‌పై ఒత్తిడి పెంచారు. మూడో క్వార్టర్ ప్రారంభంలోనే (31వ నిమిషం) పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్ గోల్‌గా మలిచి మ్యాచ్‌ను 2-2తో సమం చేశాడు.

47వ నిమిషంలో నికోలస్ డి కెర్పెల్ గోల్ కొట్టడంతో బెల్జియం 3-2 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మ్యాచ్ ముగియడానికి మరో 26 సెకన్లు మాత్రమే మిగిలి ఉండగా భారత్‌కు పెనాల్టీ కార్నర్ లభించగా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్ కొట్టి స్కోరును 3-3తో సమం చేయడంతో మ్యాచ్ షూటౌట్‌కు దారితీసింది.

షూటౌట్‌లో బోల్తా:

పెనాల్టీ షూటౌట్‌లో భారత్ తరఫున శిలానంద్ లక్రా, దిల్‌ప్రీత్ సింగ్, అభిషేక్‌లు గోల్స్ చేయగా.. హర్మన్‌ప్రీత్, సుఖ్‌జీత్ సింగ్‌లు లక్ష్యాన్ని చేరడంలో విఫలమయ్యారు. బెల్జియం తరఫున టామ్ బూన్, డె స్లూవర్, హెండ్రిక్స్, దువేకోట్‌లు పక్కాగా గోల్స్ సాధించడంతో 4-3 తేడాతో విజయం బెల్జియం వశమైంది.

మొదటి రౌండ్‌లో వేల్స్ (3-1), పాకిస్తాన్ (5-3)లపై విజయం సాధించినప్పటికీ, ఇంగ్లండ్, నెదర్లాండ్స్, అర్జెంటీనా చేతుల్లో పరాజయం పాలై భారత జట్టు సెమీస్ అవకాశాలను కోల్పోయింది.

# లార్డ్స్ టెస్టులో ఇంగ్లండ్ ఆధిపత్యం




**పాకిస్థాన్‌పై 261 పరుగుల భారీ ఆధిక్యం**

**పాకిస్థాన్‌ను 110 పరుగులకే కుప్పకూల్చిన ఇంగ్లండ్ పేసర్లు**

**ఆలీ రాబిన్సన్ 4/11, జోఫ్రా ఆర్చర్ 3/26లతో విజృంభణ**

**రెండో ఇన్నింగ్స్‌లో 81/3 స్కోరు వద్ద ఇంగ్లండ్; చేతిలో 7 వికెట్లు**

బలగం టీవీ, లండన్

లార్డ్స్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టుపై ఇంగ్లండ్ జట్టు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. మ్యాచ్ రెండో రోజైన శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. దీంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి మొత్తం 261 పరుగుల భారీ ఆధిక్యాన్ని సొంతం చేసుకుంది. వెలుతురు లేమి కారణంగా ఆటను ముందుగానే ముగించారు.

110 పరుగులకే పాకిస్థాన్ లంబకోణం:

తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 290 పరుగులకు ఆలౌట్ కాగా, బ్యాటింగ్ ప్రారంభించిన పాకిస్థాన్ పేలవ ప్రదర్శనతో కేవలం 110 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్ పేసర్ ఆలీ రాబిన్సన్ 13 ఓవర్లలో 6 మెయిడెన్లతో 11 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు పడగొట్టగా, విపరీతమైన వేగంతో బౌలింగ్ చేసిన జోఫ్రా ఆర్చర్ 3 వికెట్లు, జోష్ టంగ్ 2 వికెట్లు తీశారు. పాకిస్థాన్ బ్యాటర్లలో అజన్ అవైస్ (46 పరుగులు) ఒక్కడే పోరాడగా, మిగతా బ్యాటర్లు తీవ్రంగా నిరాశపరిచారు. స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ (8 పరుగులు) కూడా విఫలమయ్యాడు.

పోరాడుతున్న పాక్ బౌలర్లు:

తొలి ఇన్నింగ్స్‌లో లభించిన 180 పరుగుల భారీ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్‌ను పాకిస్థాన్ బౌలర్లు కొంతవరకు కట్టడి చేశారు. ఖుర్రమ్ షెహజాద్, మహమ్మద్ అలీలు బెన్ డకెట్, జోర్డాన్ కాక్స్, జో రూట్‌లను అవుట్ చేశారు. ప్రస్తుతం క్రీజులో ఎమిలియో గే (30 నాటౌట్), హ్యారీ బ్రూక్ (7 నాటౌట్) ఉన్నారు. చేతిలో మరో 7 వికెట్లు ఉన్న ఇంగ్లండ్, తొలి టెస్టు మాదిరిగానే ఈ మ్యాచ్‌ను కూడా మూడు రోజుల్లోనే ముగించి సిరీస్‌ను కైవసం చేసుకునే దిశగా పయనిస్తోంది.

# భారత్ 2030 సీడబ్ల్యూజీ, 2036 ఒలింపిక్ బిడ్‌లపై అమిత్ షా సమీక్ష

**కేంద్ర క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవీయ, గుజరాత్ డిప్యూటీ సీఎం హర్ష్ సంఘవితో కలిసి సమావేశం నిర్వహించిన అమిత్ షా**

**అహ్మదాబాద్ వేదికగా 2030 కామన్వెల్త్ గేమ్స్, 2029 వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్ నిర్వహణ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి**

**2036 ఒలింపిక్స్ ఆతిథ్య వేలం రేసుపై స్పష్టత; 2029 కంటే ముందే ప్రకటన వెలువడే అవకాశం లేదని వెల్లడి**



బలగం టీవీ, హైదరాబాద్

2030 కామన్వెల్త్ గేమ్స్ (CWG) ఆతిథ్య ఏర్పాట్లతో పాటు, 2036 ఒలింపిక్ క్రీడలను సొంతం చేసుకునే ప్రతిపాదనలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా గురువారం ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ, గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవి పాల్గొని సంబంధిత పురోగతిని చర్చించారు.

అంతర్జాతీయ క్రీడల హబ్‌గా భారత్:

"భారత్‌ను అంతర్జాతీయ క్రీడలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా అమిత్ షా పేర్కొన్నారు. 2036 ఒలింపిక్స్ బిడ్‌తో పాటు అహ్మదాబాద్‌లో జరగనున్న 2029 'వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్', 2030 'కామన్వెల్త్ గేమ్స్' నిర్వహణకు సంబంధించిన భద్రత, రవాణా ఏర్పాట్లపై హోంశాఖ ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందని ఆయన తెలిపారు.

అహ్మదాబాద్ వేదికగా క్రీడా మహోత్సవాలు:

రెండు దశాబ్దాల తర్వాత కామన్వెల్త్ గేమ్స్ మళ్లీ భారత్‌లోకి అడుగుపెడుతున్నాయి. గతంలో 2010లో ఢిల్లీ వేదికగా జరగ్గా, ఇప్పుడు అహ్మదాబాద్ ఈ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వనుంది. అంతేకాకుండా, 2036 ఒలింపిక్స్ వేలం పోటీలోనూ అహ్మదాబాద్ ప్రధాన రేసులో ఉంది.

దీనికంటే ముందుగా అహ్మదాబాద్‌లో జరగనున్న 'వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్' ద్వారా భారత్ తన సన్నాహక బలాన్ని ప్రదర్శించనుంది. ఈ మెగా ఈవెంట్‌లో 70 దేశాల నుంచి దాదాపు 10,000 మంది అథ్లెట్లు పాల్గొననున్నారు. 2036 ఒలింపిక్స్ ఆతిథ్యంపై నిర్ణయం 2029 కంటే ముందు వచ్చే అవకాశం లేదని అధికారులు స్పష్టం చేశారు.

# సోనాల్ దినూషపై గౌతమ్ గంభీర్ ప్రశంసల వర్షం



**సిరీస్‌లో ప్రదర్శించిన పట్టుదలకు భారత జట్టుకు అభినందనలు తెలిపిన ముఖ్య కోచ్ గంభీర్**

**అద్భుత ప్రతిభ చాటిన శ్రీలంక బ్యాటర్ సోనాల్ దినూషకు ప్రత్యేక ప్రశంసలు**

**టెస్టుల్లో శ్రమించి మ్యాచ్‌ను డ్రాగా ముగించిన లంక; 1-0తో సిరీస్ చేజిక్కించుకున్న భారత్**

బలగం టీవీ, హైదరాబాద్

శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో భారత జట్టు చివరి వరకు చూపిన మానసిక ధైర్యం, పట్టుదలను టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కొనియాడారు. అదే సమయంలో ఈ సిరీస్‌లో అసాధారణ పోరాట పటిమను ప్రదర్శించిన శ్రీలంక బ్యాటర్ సోనాల్ దినూషకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

గాల్‌లో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో విజయం సాధించగా, కొలంబోలో జరిగిన రెండో టెస్టు ఆఖరి ఇన్నింగ్స్‌లో శ్రీలంక గొప్పగా పుంజుకుని మ్యాచ్‌ను డ్రా చేసుకోగలిగింది. దీంతో భారత్ టెస్టు సిరీస్‌ను 1-0తో సొంతం చేసుకుంది.

అరుదైన రికార్డు సాధించిన దినూష:

"టెస్టు క్రికెట్‌కు స్వభావం, సహనం, మానసిక బలం చాలా అవసరం.. అది మన ఆటగాళ్లలో స్పష్టంగా కనిపించింది! అలాగే అద్భుత ప్రదర్శన చేసిన సోనాల్ దినూషకు నా ప్రత్యేక అభినందనలు!" అని గంభీర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' (X) వేదికగా పేర్కొన్నారు.

శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 103 పరుగులు చేసిన దినూష, ఫాలో-ఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్‌లోనూ 133 పరుగులతో నాటౌట్‌గా నిలిచి భారత విజయానికి అడ్డుగోడలా నిలిచాడు. ఫాలో-ఆన్ పడిన తర్వాత ఒకే టెస్టులోని రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు సాధించిన ప్రపంచంలోనే మూడో బ్యాటర్‌గా దినూష సరికొత్త చరిత్ర సృష్టించాడు. గతంలో విలాస్ హజారే (ఆస్ట్రేలియాపై, 1948), అండీ ఫ్లవర్ (దక్షిణాఫ్రికాపై, 2001) మాత్రమే ఈ ఘనత సాధించారు. దినూష ఈ సిరీస్‌లోని 4 ఇన్నింగ్స్‌ల్లో కలిపి 420 పరుగులు సాధించి టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

## ఈ-స్పోర్ట్స్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా ఆశిష్ షెలార్

బలగం టీవీ, హైదరాబాద్

ఈ-స్పోర్ట్స్ గేమ్స్ ఫెడరేషన్ (ఈఎస్‌జీఎఫ్) అధ్యక్షుడిగా మహారాష్ట్ర మంత్రి, ఆసియా క్రికెట్ కౌన్సిల్ బోర్డు సభ్యుడు అడ్వొకేట్ ఆశిష్ షెలార్ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. న్యూఢిల్లీలో జరిగిన ఈఎస్‌జీఎఫ్ బోర్డు సమావేశంలో ఆయన ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా తాత్కాలిక అధ్యక్షుడు అడ్వొకేట్ నందన్ ఝా, చైర్‌పర్సన్ అశోక్ ధ్యాన్‌చంద్ కలిసి ఆశిష్ షెలార్ పేరును ప్రతిపాదించారు. సమావేశానికి హాజరైన సభ్యులు, రాష్ట్రాల ప్రతినిధులంతా ఈ ప్రతిపాదనకు ఏకగ్రీవంగా మద్దతు తెలిపినట్లు ఈఎస్‌జీఎఫ్ ఒక ప్రకటనలో వెల్లడించింది.

మహారాష్ట్ర ప్రభుత్వంలో ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత, కృత్రిమ మేధ, సాంస్కృతిక వ్యవహారాల శాఖలకు షెలార్ మంత్రిగా వ్యవహరిస్తున్నారు.భారత్‌లో సుమారు 60 కోట్ల మంది ఈ-స్పోర్ట్స్‌తో అనుబంధం కలిగి ఉన్నారని షెలార్ తెలిపారు. సెప్టెంబర్‌లో భారత ఈ-స్పోర్ట్స్ జట్టు ఆసియా క్రీడల్లో పాల్గొనేందుకు జపాన్‌కు వెళ్లనుందని చెప్పారు. క్రీడాకారులకు మెరుగైన వేదికలు, శిక్షణ, పోటీలు, అభివృద్ధికి అవసరమైన అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈఎస్‌జీఎఫ్ దేశంలో ఈ-స్పోర్ట్స్, మైండ్ స్పోర్ట్స్ అభివృద్ధి, నియంత్రణ, ప్రోత్సాహం కోసం పనిచేస్తున్న జాతీయ సంస్థ. ఇది గ్లోబల్ ఈ-స్పోర్ట్స్ ఫౌండేషన్, అంతర్జాతీయ ఈ-స్పోర్ట్స్ సమాఖ్యల్లో సభ్యత్వం కలిగి ఉండగా, భారత పారాలింపిక్ కమిటీ గుర్తింపు పొందింది.